క్లుప్తంగా

బాణసంచా విక్రయకేంద్రాల ఆకస్మిక తనిఖీ



బాణసంచా జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

నాతవరం: దీపావళి పండగ సమయంలో సామగ్రి వెలిగించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వర రావు అన్నారు. స్థానిక అయ్యప్ప మందుగుండు సామాగ్రి విక్రయ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. సామాగ్రి విక్రయ సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎటువంటి జాగ్రత్తలు చేపట్టాలో సిబ్బంది తగు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దీపావళి పండగ కు సామాన్యుల విక్రయాలు చేయాలన్నారు. అనంతరం దీపావళి నాడు ప్రమాదాలు చోటు చేసుకుండా ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై మాక్ డ్రిల్లు ద్వారా అవగాహన కల్పించారు.

పంట పొలాల వద్ద పూజలు

మాడుగుల రూరల్ : చిత్తకార్తె ప్రారంభం కావడంతో గ్రామాల్లో రైతులు పంట పొలాల వద్ద బుధవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా కళ్లం పాకల వద్ద గొర్రెలను బలి ఇచ్చి, బల్లి అన్నంను పంట పొలాలు మీద చల్లారు. పంట పొలాలు సమృద్ధిగా పండాలని కోరుతూ ప్రతి ఏటా దసరా పండగ అయిన తర్వాత చిత్తకార్తె ప్రారంభం రోజున చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా మునిడి చెట్టు కొమ్మలను పంటపొలాల వద్ద, ఇంటి వద్ద పెట్టారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌తో కల్తీ మద్యం గుర్తింపు



ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్

నర్సీపట్నం : ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌తో కల్తీ మద్యాన్ని గుర్తించవచ్చునని నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని వైన్‌షాపుల దుకాణదారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. విక్రయించే ప్రతి మద్యం బాటిల్‌ను షాపులో విధిగా స్కాన్ చేయాలని సూచించారు. మద్యం కొనుగోలు చేసిన వారు మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే బాటిల్ సమాచారం వస్తుందన్నారు. స్కాన్ చేసిన తరువాత ఎర్రర్ అని వస్తే కల్తీ మద్యంగా గుర్తించాలన్నారు. కొనుగోలుదారులు వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మల్లాం రోడ్డులో తుప్పల తొలగింపు



మల్లాం రోడ్డులో పొక్లెయిన్‌తో తుప్పలు తొలగిస్తున్న స్థానికులు

బుచ్చెయ్యపేట : మల్లాం రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను స్థానిక యువకులు తొలగించారు. ఆర్.శివరాంపురం నుంచి మల్లాం వరకు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా తుప్పలు పెరిగి రవాణాకు ఆటంకంగా మారింది. సింగిల్ రహదారికి తోడు మళ్లింపులు ఎక్కువగా ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకునేందుకు వీలుకాక పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో స్థానిక యువకులు బుధవారం పొక్లెయిన్ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో వాహనదారులు వారిని అభినందించారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

చీడికాడ: చీడికాడ మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హేమచందరరావు తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 10గంటలకు ఎంపిడిఓ సమావేశ మందిరంలో ప్రారంభమౌతుందన్నారు. ప్రాదేశిక సభ్యులు,ఇతర అనుబంధ సభ్యులు హాజరు కావాలన్నారు.

భూ సమస్యపై వినతి

మాకవరపాలెం : తామరం రెవెన్యూలో తాత, తండ్రుల నుంచి సంక్రమించిన భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని రాచపల్లి గ్రామస్తులు కోరారు. బుధవారం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాచపల్లికి చెందిన రాయవరపు పేరయ్య, నాగరాజులకు తామరం రెవెన్యూ 61/3లో ఉన్న భూమిని సాగు చేసేవారన్నారు. వారు మరణించడంతో వారసులకు చెందాల్సిన ఈ భూమిని కొందరు అన్యాక్రాంతం చేసేందుకు చూస్తున్నారని తెలిపారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

రేపు అన్నసమారాధన

మాకవరపాలెం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల దుర్గామేల్లేశ్వర దేవస్థానం వద్ద శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ అర్చకులు శర్మ తెలిపారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.



వడ్డాది వద్ద దెబ్బతిన్న మెయిన్‌రోడ్డు



కొత్తకోట- మేడివాడ రోడ్డులో పెద్దపెద్ద గుంతల్లో కూరుకు పోయిన లారీ

దారులు... దారుణం

గోతుల మయమైన ప్రధాన రోడ్లు

చోడవరం నుంచి పాడేరు వెళ్లాలంటే నరకమే

వడ్డాది–నర్సీపట్నం రోడ్డు ప్రమాదాలకు నిలయం

చోడవరం–అనకాపల్లి రోడ్డులో గోతులతో నిత్యం ట్రాఫిక్‌జామ్

రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకంగా మారింది. ఎప్పుడు ఏ గోతిలో వాహనం పడిపోతుందోనన్న భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతలు కాకుండా ఏకంగా రోడ్డు మధ్యలో పెద్దపెద్ద నూతులే ఉన్నట్టుగా మారింది బీఎన్‌రోడ్డు. ప్రధానంగా చోడవరం వయా వడ్డాది, కొత్తకోట, నర్సీపట్నం, వడ్డాది- చోడవరం వయా ఎం.కోడూరు, మాడుగుల రోడ్డు, చోడవరం- వెంకన్నపాలెం, అనకాపల్లి రోడ్డు పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

చోడవరం : పాడేరు ఏజెన్సీకి ముఖ ద్వారమైన చోడవరం కేంద్రంగా ఉన్న ప్రధాన రహదారులన్నీ పెద్దపెద్ద గోతులు పడి చాలా ఘోరంగా ఉన్నాయి. ప్రధానంగా అనకాపల్లి నుంచి వయా చోడవరం, వడ్డాది, రావికమతం, కొత్తకోట, రోలుగుంట, నర్సీపట్నం రోడ్డు, వడ్డాది నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా పాడేరు వెళ్లే రోడ్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. మధ్యలో విజయరామరాజుపేట, వడ్డాది వంతెనలు కూలిపోవడంతో అక్కడ పెద్దేరు, బొడ్డేరు నదులపై వేసిన అప్రోచ్‌రోడ్లు సైతం కొట్టుకుపోవడంతో ఈ దారిలో ప్రయాణం చాలా ప్రమాదకరంగా మారింది.



వెంకన్నపాలెం-చోడవరం రహదారిలో పెద్దపెద్ద గోతులతో ఉన్న మెయిన్‌రోడ్డు

- విజయరామరాజుపేట వద్ద అప్రోచ్ రోడ్డు పూర్తిగా నదిలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో ఇటీవల తాత్కాలిక కాజ్‌వే నిర్మించారు. అది కూడా నాణ్యతా లోపంతో ఎక్కడికక్కడ గోతులుగా మారింది. కాజ్‌వే వద్ద ఇటీవల పలు వాహనాలు బోల్తా పడి పలువురు ప్రయాణికులు, వాహనచోదకులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.
- చోడవరం –గవరవరం రోడ్డు, చోడవరం–చీడికాడ రోడ్డు, పెద్దపెద్ద గోతులు పడి వాహనచోదకులకు ప్రాణసంకటంగా ఉన్నాయి. ప్రాణాపాయంలో ఉన్న రోగులను, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను అంబులెన్సుల్లో పాడేరు, మాడుగుల, వడ్డాది, కొత్తకోట, నుంచి చోడవరం, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు తరలించాలంటే గంటల తరబడి ప్రయాణ సమయం పట్టి ఈ గోతుల కారణంగా, ట్రాఫిక్ జామ్ కారణంగా మధ్యలోనే ప్రాణాల్లో గాల్లో కలిసిపోయే పరిస్థితి ఉంది.
- బీఎన్ రోడ్డు విస్తరణ పనులు తీసుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రెండున్నరేళ్లుగా ఈ రోడ్డుకు రూ.112 కోట్లు నిధులు మంజూరైనా నేటికీ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా ఉంది. నిధులు మంజూరయ్యే సమయానికి చిన్న చిన్న గోతులతో ఉండే ఈ రోడ్డు ఇప్పుడు పనులు చేపట్టకపోవడంతో పెద్దపెద్ద గోతులు, నూతులుగా మారి ప్రయాణికుల పాలిట అత్యంత ప్రమాదకరంగా మారింది.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది సంక్రాంతి నాటికి ఈ రోడ్లన్నీ బాగు చేస్తామని హామీ ఇచ్చారు. అయినా ఈ రోడ్లకు మోక్షం కలగలేదు. ఇటీవల ఈ రోడ్డును బాగుచేయాలని కోరుతూ స్థానిక న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి చోడవరం కోర్టులో కేసు వేయగా వెంటనే రోడ్డు వేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను కోర్టు ఆదేశించింది. అయినా నేటికీ రోడ్డు పనులు ఏమీ జరగలేదు. రోజూ అనేక వాహనాలు ఈ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు ఈ గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని రోడ్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలు విజయవంతం చేయాలి

కె.కోటపాడు : స్థానిక హైస్కూల్‌లో ఈ నెల 17, 18లలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడాపోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ తెలిపారు. కె.కోటపాడు హైస్కూల్‌లో బుధవారం ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ పోటీలను అండర్–14, 17 విభాగాల్లో నిర్వహించాలని తెలిపారు. 17న బాలికలకు, 18న బాలురకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, యోగా పోటీలను నిర్వహించడంతో పాటు అనకాపల్లిలో జరిగే డివిజనల్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేయాలని ఎంఈవో సూచించారు. మండల స్థాయిలో జరుగుతున్న పోటీల్లో 7 హైస్కూళ్లు, కేజీబీవీ విద్యార్థినులతో పాటు ఐదు ప్రైవేట్ పాఠశాలల్లో గల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు కె.లక్ష్మి, చిట్టిప్రసాద్, తమ్మునాయుడు, కిరణ్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

జీవన ఎరువులతో భూసారం పెరుగుదల

రోలుగుంట : జీవన ఎరువులతో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయ శాఖ, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ తెలిపారు. శరభవరం గ్రామంలో బుధవారం జీవన ఎరువుల వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం వల్ల భూమి నిస్సారం అవుతుందన్నారు. జీవన ఎరువులు అజో స్పైరిల్లమ్, అజటోబాక్టర్, పాస్ఫరస్ సాల్యుబ్ రైజింగ్ బాక్టీరియా, పొటాస్‌ను అందించే పొటాస్ రిలీజింగు బాక్టీరియా వంటి జీవన ఎరువుల వినియోగంతో భూమి సారవంతంగా మారి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. కుళ్లిన గెత్తంతో వీటిని కలుపుకొని వినియోగించడం వల్ల భూసారం పెరిగి, ఖర్చు తగ్గుందన్నారు. జీవన ఏరువులు ఏ విధంగా కలిపి గెత్తంలో వేయాలో డెమో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సౌజన్య, నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి, ఆత్మ బీటీఎం కిషోర్, మండల వ్యవసాయాధికారి చిరంజీవి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కొండెంపూడి శాస్త్రవేత్త రాజకుమార్

'దేవరాపల్లి పంచాయతీలో అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి'

దేవరాపల్లి : దేవరాపల్లి పంచాయతీలో వెలుగు చూసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దేవరాపల్లి ప్రజల కష్టాన్ని అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇంటి పన్నుల రూపంలో వసూళ్లు చేసి ప్రభుత్వానికి చెల్లించకుండా స్వాహా చేశారని విమర్శించారు. ఈ అవినీతిలో స్థానిక సిబ్బంది హస్తం ఉన్నట్టు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అధికార పార్టీ నేతల అండతోనే ఈ అవినీతి బాగోతం భయటపడకుండా ఇప్పటి వరకు గోప్యంగా ఉంచారన్నారు. పంచాయతీలో ఇప్పటికే ఇరిగేషన్, గ్రామ కంఠం భూముల్లో ఇంటి నిర్మాణ అనుమతుల పేరిట పెద్ద ఎత్తున కొందరు అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతూ దోచుకుంటున్నారన్నారు. గతంలో ఇదే పంచాయతీలో మరుగుదొడ్ల అక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆయన గుర్తు చేశారు. పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లతో పాటు ఆర్థిక సంఘం నిధులపై కూడా సమగ్ర విచారణ చేపడితే భారీ స్థాయిలో అవకతవకలు బయట పడతాయన్నారు. పంచాయతీ అవినీతిపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని అన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రూ.26వేల రికవరీకి పీడీ ఆదేశం



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు : వి.సంతపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పశువుల షెడ్‌లో గోడలను ఏర్పాటు చేసుకుని లబ్ధిదారుడు బోను నాగేశ్వరరావు నివాసం ఉంటున్నట్టు సోషల్ ఆడిట్ సభ్యులు కె.కోటపాడులో బుధవారం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో వెల్లడించారు. సమావేశానికి హాజరైన డ్వామా పీడీ పూర్ణిమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఏ లక్ష్యాలతో రైతులకు పశువుల షెడ్‌లను మంజూరు చేస్తుందో వాటికే ఉపయోగపడేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలని అన్నారు. పశువుల షెడ్‌లో ఏర్పాటు చేసిన గోడలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకూ ఉపాధి హామీ పథకం నిధులతో జరిగిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఉపాధి పనుల్లో గుర్తించిన అవకతవకలను వెల్లడించారు. గొండుపాలెంలో ఒకరికి బదులుగా ఆ కుటుంబంలో వారు పనికి వెళ్తున్నట్టు గుర్తించారు. చౌడువాడలో కృష్ణసాగరం చెరువులో జరిగిన అభివృద్ధి పనుల ఎస్టిమేట్ కన్నా సుమారు రూ.80 వేలు వేతనదారులకు చెల్లించినట్టు గుర్తించారు. కొండలపై చేపట్టిన సరిహద్దు కందకాల పనుల్లో కూడా ఎస్టిమేట్ కన్నా రూ.57 వేల చెల్లింపులు వేతనదారులకు అదనంగా జరిగినట్టు తెలిపారు. ఆర్.వై.అగ్రహారంలో అరుణ, దేముడమ్మ మస్టర్‌లలో సంతకాలు లేకున్నా ఆరు రోజుల వేతనాలను మంజూరు చేసారని, వీరితో పాటు గుంపాన సింహాద్రికి మస్టర్‌లలో వేలిముద్రలు, సంతకాలు లేకున్నా నగదు చెల్లింపులు చేసినట్టు తెలిపారు. పనుల నిర్వహణతో పాటు కొలతల్లో తేడాలున్నట్టు వెల్లడవడంతో డ్వామా పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధిహామీ టీఏలు గంగునాయుడు, సత్యంకు రూ.14,500 అపరాధ రుసుముతో పాటు మస్టర్‌లలో దిద్దుబాట్లు, రికార్డుల నిర్వహణ లేకపోవడంతో దాలివలస, మేడిచర్ల, ఆనందపురం వీఆర్పీలకు రూ.11500 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఉపాధి పథకం కౌన్సిల్ మెంబర్ బాబూరావు, విజిలెన్స్ అధికారి దేవి శ్రీలలిత, ఎస్‌టీఎం సత్యనారాయణ, చిరంజీవి, ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల : ఈ నెల 17 వ తేదీన కింతలి సబ్ స్టేషన్‌కు కొత్తలైన్ వేయడం కారణంగా గాదిరాయి సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం అప్పారావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

దేవరాపల్లి : దేవరాపల్లి సబ్ స్టేషన్ నుంచి మండల కేంద్ర ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె. శంకరరావు తెలిపారు. వైర్ల మార్పడం, లైన్ మెయింటెనెన్స్ తదితర పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలి

రావికమతం: నక్కపల్లి మండలం రాజపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు బుధవారం రావికమతంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు మండల కన్వీనర్ వి.సత్యవతి మాట్లాడుతూ 22 రోజులుగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వీరి పక్షాన నిలబడిన రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజుని గృహనిర్బంధం చేసి ఇబ్బంది పెట్టడాన్ని ఖండించారు.



రావికమతంలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు

హైస్కూల్లో గాంధీ విగ్రహం ఆవిష్కరణ

గొలుగొండ : కృష్ణదేవిపేట హైస్కూల్లో మంగళవారం రాత్రి మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన స్థానిక అల్లూరి సీతారామరాజు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకల రామకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. క్లబ్ సభ్యులు కొల్లూరి పార్వతి, వెంకటకృష్ణ, లక్ష్మణరావు,హరికృష్ణ, ఎంఈవో కృష్ణప్రసాద్, అల్లూరి సీతారామరాజు వాసవీక్లబ్ అధ్యక్షులు చెక్కా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహం ఆవిష్కరిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

ఘనంగా పైడిమాంబ సారె ఊరేగింపు

బుచ్చెయ్యపేట : చిన అప్పనపాలెం గ్రామదేవత పైడిమాంబకు గ్రామస్తులు సారె ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం అమ్మవారికి ఘనంగా సారె ఊరేగింపు చేపట్టారు. మేళతాళాల నడుమ బాణసంచా, నేల వేషాల నడుమ సారె ఊరేగింపు ఘనంగా చేపట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేపట్టనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.



అమ్మవారికి సారె ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

ప్రజా ఉద్యమంపై నిర్బంధం తగదు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



రోలుగుంటలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు



ఎ.కోడూరులో రాస్తారోకో



ఎం.గదబూరులో ఐదో షెడ్యూల్ సాధన కమిటీ సభ్యుల నిరసన

నర్సీపట్నం: ప్రజా ఉద్యమంపై ప్రభుత్వం నిర్బంధం విడనాడాలని సీపీఎం నాయకులు బుధవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ నక్కపల్లి మండలం, రాజయ్యపేట వద్ద ప్రజలకు నష్టం కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. కాకినాడ తీరం తొండంగి వద్ద వచ్చిన బల్క్ పరిశ్రమని అక్కడ మత్స్యకారులు, రాజకీయ పార్టీలు వ్యతిరేకించడంతో రాజయ్యపేట తీసుకొచ్చారన్నారు. దీనిని రద్దు చేయాలని పోరాడుతున్న ప్రజా సంఘాల నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని, వెంటనే అనుమతులు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేష్, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, శివ పాల్గొన్నారు.

రోలుగుంట : నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ ట్రక్ పార్క్ ఏర్పాటును రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు బుధవారం రోలుగుంటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దీనికి నాయకత్వం వహించిన ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ 22 రోజులుగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వీరి పక్షాన నిలబడిన అప్పలరాజుని గృహనిర్బంధం చేసి ఇబ్బందులకు గురిచేయడాన్ని ఖండించారు. మత్స్యకారులను నష్టం కలిగించే పరిశ్రమలను రద్దు చేయాలని డిమాండు చేశారు. నిరసనలో నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : నక్కపల్లి మండలంలో రాజయ్యపేటలో మత్స్యకారుల భూములను బల్క్‌డ్రగ్ కంపెనీ ఏర్పాటుతో బలవంతపు భూసేకరణ నిర్వహించడం అన్యాయమని సీపీఎం నాయకుడు వనుము సూర్యనారాయణ అన్నారు. ఎ.కోడూరులో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులకు అండగా నిలిచిన ప్రజాసంఘాల నాయకులపై అక్రమ నిర్బంధం తొలగించాలని బుధవారం సీపీఎం నాయకులు రాస్తారాకో చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో 33 వేల ఎకరాల్లో భూమి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇది చాలదన్నట్టు మత్స్యకారుల భూములనూ స్వాధీనం చేసుకోవాలని చూడడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొంగలి గోపి, బొడ్డు సన్యాసయ్య, సూర్రెడ్డి ముత్యాలనాయుడు, సిరపరపు రాము పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : రాష్ట్రంలో పోలీసుల పనితీరును ప్రతి ఒక్కరూ ఖండించాలని బుధవారం ఎం.గదబూరు గ్రామంలో నిరసన తెలిపారు. ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కె.భవానీ గదబూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్స్ పార్క్‌కు వ్యతిరేకంగా వేలాది మంది మత్స్యకారులు శాంతియుతంగా అందోళన చేస్తుండగా, దీనికి సంఘీభావం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును గృహ నిర్బంధంలో ఉంచారని దుయ్యబట్టారు. ఇది పూర్తిగా అప్రజాస్వామ్యమని అన్నారు.

చీడికాడ : బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని మండల సీఐటీయు మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కోనాంలో రాస్తారోకో నిర్వహించారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద పర్యావరణానికి, మత్స సంపదకు, ప్రజలకు నష్టం కలిగించే బల్క్ డ్రగ్‌పార్కు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం



వాసవీ మాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం జంపెన గ్రామంలో వాసవీ మాత ఆలయంలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు గున్నయ్యశెట్టి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ వాసవీ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ పేద ఆర్యవైశ్య సభ్యులను ఆదుకోవడానికి 52 సంక్షేమ పథకాలు తీసుకు వచ్చామన్నారు. అనంతరం వాసవీమాతను దర్శించుకుని పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకట రాజారామ్, ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు శ్రీను, క్లబ్ జిల్లా గవర్నర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రావికమతం : మండలంలో బుధవారం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పర్యటించారు. హౌసింగ్ లబ్ధిదారులు 24 మందికి రెండు ఫ్యాన్‌లు,ఎల్‌ఈడీ బల్బులను పంపిణీ చేశారు. గర్నికం వద్ద మండల స్టాక్ పాయింట్ గోదాంను ప్రారంభించారు. మేడివాడలో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ ఆవరణలో రూ.7 లక్షలతో చేపట్టిన మినీ కమ్యూనిటీ హాలు భవనం ప్రారంభించారు. మేడివాడలో జరిగిన సభలో మాట్లాడుతూ బీఎన్ రోడ్డు పనులను వర్షాలు తగ్గాక మొదలు పెడతారని చెప్పారు. ఎంపీపీ పైల రాజు, ఎంపీడీవో మహేష్, తహసీల్దార్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఖాసిమ్‌కు ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారం

కె.కోటపాడు : అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా జాతీయ విద్యార్థి దినోత్సవం పురస్కరించుకొని విజయనగరం జిల్లా గజపతినగరంలో బాలాజీ విద్యాసంస్థలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కె.కోటపాడుకు చెందిన అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్‌కు ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారం ప్రదానం చేశారు. సామాజిక సేవా భావంతో పాటు గ్రామీణ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి ఖాసిమ్ చేస్తున్న కృషికి ఈ పురస్కారాన్ని అందించారు. సత్యసాయి విద్యామృతం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని కాసిమ్‌కు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు, దామోదరం సంజీవయ్య లా వర్సిటీ వీపీ డి.సూర్యప్రకాశరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఆర్‌జేడీ విజయభాస్కర్ అందించారు.



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

కె.కోటపాడు : సామాన్యునిగా పుట్టి దేశ అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. పాఠశాలలో అబ్దుల్ కలాం 94వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాల వేసి ఆయన ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు.



కె.కోటపాడులో కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ ఖాసిమ్

గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట

రావికమతం : చినపాచిల గ్రామంలో గౌరీ పరమేశ్వర్ల విగ్రహాన్ని (పుట్టుక) ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. ఏటా కార్తీక మాసంలో గౌరీ పరమేశ్వర్లని ప్రతిష్ఠించి, నెల రోజుల పాటు పూజా కార్యక్రమాలు జరిపించి అనంతరం నిమజ్జనం చేస్తారు. ప్రతిరోజూ రాత్రి పూట వాలకాలు కడతారు.



గౌరీ పరమేశ్వర్ల విగ్రహానికి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు